# మీరంతా నావాళ్ళే

"అబ్బ ఎంత బావుందో చీర" ఆశ్చర్యంగా చీరవంక చూస్తూ అంది రాణి. రాణి మేనత్త జానకి ఎ.జి. ఆఫీసులో సెక్షనాఫీసరు. ఢిల్లీలో వుండే రాణి, అంటే జానకి అన్నకూతురు, సెలవులకి వచ్చిందిక్కడికి.

"అత్తా, చెప్పు, ఈచీర ఎక్కడ కొన్నావు"? అంది. అత్త జానకి చీరకుచ్చెళ్ళు సద్దుకుంటుంటే.

"మొన్న ఎగ్జిబిషన్‌లో" అంది అద్దం ముందు నిలబడి లిప్‌స్టిక్ వేసుకుంటూ జానకి.

జానకి అంటే చాలా ఇష్టం రాణికి. నలుగురు మేనత్తలున్నా, జానకి దగ్గరే రాణికి చనువు. సెలవలివ్వటం ఆలస్యం, వచ్చేస్తుంది.

"ఇవాళ, ఆఫీసునించి వచ్చేసరికి నువ్వు రెడీగా వుండు. సినిమాకెడదాం.. సరేనా.. నాకు టైమయిపోయింది" జానకి హడావిడిగా బయల్దేరింది. స్కూటర్ స్టార్ట్ చేసి ఆఫీసుకెళ్ళిపోయింది.

తనూ అత్తలాగే వుండటం బలే ఇష్టం. అయినా, పాపం, అత్త - అప్రయత్నంగా ఎందుకో జానకిపై జాలేసింది రాణికి.

"ఇంత ఖరీదయిన చీర, వద్దు" అంది రాణి ఒక సారి జానకితో.

"ఖరీదంటే? - నాలుగు నెలలుగా అప్పుడప్పుడు వాడాను.. ఇంక చాలా. నువ్వు చుడీదార్‌పైజామా వేసుకుంటే ఈ చీర ఎంతో బావుంటుంది. అంతే" అంది ఎంతో తెలిగ్గా.

బీరువా తీస్తే చాలు జారిపడిపోతుంటాయి జానకి చీరలు. ఢిల్లీ నుంచి వచ్చినప్పుడల్లా, ఆ బీరువా సర్దటం ఎంతో ఇష్టం రాణికి.

హాయిగా నవ్వుతూ, డబ్బు ఖర్చుచేస్తూ, కాలం గడిపేస్తుంది జానకి. ఓరోజు రాణి అంది, "ఇన్ని చీరలే మిటీ?" అని. అత్తకి చాలా కోపం వచ్చింది. "నాకిష్టం - నా యిష్టం - అంతే ఇంకోసారి ఈ విషయం మాట్లాడకు" అంది. ఎందుకు అత్తకి కోపం తెప్పించానా అని బాధపడిపోయింది రాణి.

హోటళ్ళకి భోజనాలకి తీసికెళ్ళి, సినిమాలకి తీసికెళ్ళి టాంక్‌బండ్ దగ్గరకెళ్ళి కూచుని, అలా అలా పదిహేను రోజులు సరదాగా కాలక్షేపం చేయించింది జానకి రాణిని. ఆరోజు పొద్దున్నే ఎ.పి. ఎక్స్‌ప్రెస్‌లో ఎక్కించి, కిటికీదగ్గర నిలబడి మాట్లాడుతోంది జానకి -.

"ఇదిగో, ఈ ఇంజనీరింగ్ అవగానే నీకు మంచి సంబంధం చూసి పెళ్ళి చేసేస్తాను. మీనాన్న, అమ్మ ఏమన్నాసరే" అంది జానకి రాణితో. రైలు మెల్లగా కదులుతుంటే చేయి ఊపించి రాణి. ఇంటికొచ్చాక ఇల్లంతా బోసిపోయినట్లనిపించింది. ఆరోజు ఆఫీసుకి వెళ్ళాలనిపించలేదు జానకికి.

ఇంక నెలరోజులు - తను రిటైరయిపోతుంది - ఆ తర్వాత - ఏముందీ రిటైర్డ్ సెక్షన్ ఆఫీసరి - అంతే!! జానకి అలా అద్దంలో చూసుకుని, 'డైచేసుకోటానికి బద్ధకిస్తున్నానేమిటీ - ఎంత అసహ్యంగా వుందో జుట్టు' అనుకుంది చిరాగ్గా.

ఎందుకు తనకీ ఒంటి జీవితం!! ఎందుకూ! ఆఫీసుకెళ్ళకుండా, గాడ్రెజ్ సద్దుకుంటే బావుండును అనుకుంటూ బీరువా దగ్గరగా వెళ్ళింది. ఒక్కసారి నవ్వొచ్చింది - ఈ బీరువా తనకోసం, పెళ్ళయాక అత్తవారింటికి తీసికెళ్ళటం కోసం నాన్న కొన్నది!

ఎన్ని సంబంధాలో - తనకి నచ్చనివి, తనని మెచ్చనివి - "ఏదో ఒకటి కుదిర్చేసుకోవాలికానీ, ఇలా అయితే ఎలాగే" అని తల్లి బాధపడిపోయేది. "పెళ్ళికాకపోతే ఏం - బతకలేనా" అనేది జానకి.

"ఇవాళ అలాగే అనిపిస్తుంది. కానీ ఈ వయసు పొంగుతగ్గాక, ఏ కాలో చెయ్యో వంగాక, అప్పుడు తెలుస్తుందమ్మా - నామాట విను." బతిమాలేది తల్లి ఏడ్చేది. కానీ ఎందుకో పెళ్ళిపట్ల కొన్ని ప్రత్యేకమైన అభిప్రాయాలు వుండబట్టి దేనికీ రాజీ కాలేక అలాగే ఉండిపోయింది జానకి.

'నిజమే - ఇంతకాలం హాయిగా తిని, తిరిగి, సంపాదించటం అయిపోయింది. ఇకముందు - జానకి ఒక్కసారి కళ్ళలో నీళ్ళు తిరిగాయి. తన అక్కలు ముగ్గురు హాయిగా వున్నారు. పెద్దక్కకి పక్షవాతం వచ్చి కాలు పడిపేతే, ఆరేళ్ళుగా కంటికి రెప్పలా కాపాడుకొస్తున్నాడు దాని భర్త.

రేపు తనకీ అలా అయితే - ఛీ, ఎందుకలా అవుతుంది?! కాదు - అశుభాలు మాట్లాడకూడదు. జానకి అప్రయత్నంగా ఎదురుగా వున్న కాలండరులోని వేంకటేశ్వరస్వామికి దణ్ణం పెట్టుకుంది. ఎందుకో ఏనాడూలేని వంటరితనం ఒక్కసారిగా ఈరోజు గుండెల్ని కదిలిచేస్తోంది - తల్లి మరణానికి మూలకారణంగా తనే - పెళ్ళికాకుండా మిగిలిపోయానన్న బెంగే ఆవిడ్ని చంపేసింది -

జానికికి ఉన్నట్టుండి ఆ సంఘటన గుర్తొచ్చింది. తనకి నలభైఏళ్ళు - స్నేహితురాలు ఒక సంబంధం తెచ్చింది. అతనికి భార్యపోయింది. పిల్లలు లేరు. తను చేసుకుందుకు ఏమి అభ్యంతరం? - కానీ తనే వద్దంది - ఎందుకూ - అతనడిగాడు మాటల మధ్యలో మీరు యల్.ఐ.సి. కడతారా అని. అంతే! ఆ ఒక్క ప్రశ్న ఎందుకో జానకి మనసుని మార్చేసింది. తను పెళ్ళయిన కొద్దిరోజులకే చచ్చిపోతే, తన ఇన్సూరెన్స్ డబ్బు అతనికేగా - ఎందుకో ఇదే ఆలోచన అతనిపై దురభిప్రాయాన్ని కల్గించింది. కుదిరిపోతుందన్న సంబంధం క్షణాలలో చెదిరిపోయింది - తన ఆలోచనల వికృత రూపాలివి - ఆ తర్వాత ఆదేళ్ళకి పెద్దక్క ఉత్తరం రాస్తూ "పోనీ విషయం వదిలేయ్ - ఒక పిల్లాడిని పెంచుకో - నీకు అవసరానికి వస్తాడు - కాస్త తోడుగా వుంటాడూ" అని.

ఆ ఉత్తరం చదివి మండిపడిపోయింది జానకి... ఈ జంజాటాలే వద్దనుకున్నాక, ఇప్పుడు పిల్లాడిని పెంచుకోటమా!! అక్క మనసులో ఎవరున్నారు - బహుశా దాని నాలుగో కొడుకుని పెంచుకోమనేమో దాని ఉద్దేశం - నా డబ్బు తినటానికి వాడేకావాలా, నో, నేను ఎవర్నీ పెంచుకోను - ఆవిషయం మళ్ళీ తల్చుకుందిప్పుడు జానికి చాలా ఏళ్ళ తర్వాత!! పెంచుకుంటే ఎలావుండేదో!!

పై నెలలో రిటైరవుతుంది - ఎక్కడుండేదీ - ఇక్కడే - ఇదే ఫ్లాట్‌లో - అంతే, అది పెద్ద సమస్యా?!'

ఫోన్ మోగింది -

"హలో"

"నేనత్తా - రాణీని"

"చెప్పూ - ఏమిటి విషయం?"

"అమ్మకన్నా ముందు నేనే చెప్తా - నా పెళ్ళి"

"పెళ్ళా."

"హైదరాబాదులోనే" -

ఆ తర్వాత రాణిచేతిలో ఫోను తీసుకుని తల్లి చాలా సేపు మాట్లాడింది.

జానికికి ఉన్నట్టుండి మనసులో ఒక మెరుపు మెరిసింది - ఈ రాణిని, భర్తని తన ఫ్లాట్‌లో తనతోబాటు వుండమంటే - అంతే, భగవంతుడే అన్నిటికీ ఓ దారి చూపిస్తాడంటే ఇదేనేమో!!

రెండురోజుల తర్వాత సమస్యకి పరిష్కారం దొరికింది - ఇప్పుడింక రాణి పిల్లల్నెత్తుకు పెంచుతూ అమ్మమ్మ లాగ హాయిగా కాలం గడిపేస్తా -

జానకి మనసు ఎంతో సంతోషంగా వుంది -

ఉద్యోగంలో వున్నంతకాలం స్నేహితులు, ఉద్యోగస్థులు ఎందరో వస్తూ వెడుతూ ఇల్లు సందడిగా వుండేంది. రిటైరయ్యాక ఎవరొస్తారు - ఎందరు తనని గుర్తుపెట్టుకుంటారు.

నిజానికి జానకి నిర్ణయాలు అన్నీ క్షణాలలోనే చేసేస్తుంది!!

"అత్తా, నిజంగా నీ ఏజ్ ఎవరికీ తెలియదు - రిటైరయ్యావు కాబట్టి తెలుసుకుంటున్నారంతే" అంది రాణి, భోజనం చేస్తూ.

"మిమ్మల్ని చూస్తే ఎవరైనా ఏభయి ఏళ్ళ లోపంటే నమ్ముతారు" అన్నాడు రాణి భర్త వివేక్.

ఆ మాటలకి పొంగిపోయింది జానకి. అవును! తను చాలా స్మార్ట్‌గా వుంటుంది. చాలా షోగ్గా వుంటుంది. అలా అనుకుంటూ గబుక్కున లేవబోయి మళ్ళా కుర్చీలో కూచుండిపోయింది. మోకాలు నొప్పి, అబ్బ!!

"ఖంగారుపడకండి - వయసు వస్తోంది కదా - ఈ నొప్పులన్నీ సహజమే - మా అమ్మకి ఎన్ని ఏళ్ళనుంచో మోకాళ్ళ నొప్పులు" అన్నాడు వివేక్. జానకికి ఆమాటలేవీ నచ్చలేదు.

కాలం గడుస్తోంది.. జానకిలో ఉత్సాహం తగ్గుతోంది. 'తనకెవరున్నారు - భర్తా, పిల్లలా!! రాణీ - ఆ రాణీ. దాని మొగుడి దృష్టంతా తన డబ్బుమీదే!! - డబ్బు చూసే తనదగ్గరుంటున్నారు - కాకపోతే -' ఇలా అనుకుంటుండగానే వివేక్ వచ్చాడు.

"ఆంటీ, మీరేమనుకోకపోతే ఓ మాట చెప్పనా" అన్నాడు కుర్చీ దగ్గరగా జరుపుకుంటూ.

"ఈ ఫ్లాట్ అమ్మేద్దాం ఆంటీ - ఈ డబ్బులు, మీకొచ్చిన రిటైర్‌మెంట్ బెనిఫిట్లు కలిపి త్రీ బెడ్‌రూమ్ ఫ్లాట్ కొనుక్కుందాం." వివేక్ జానకివైపు చూస్తున్నాడు.

"ఈ ఫ్లాట్ అమ్మేయడమా?" అంది వెంటనే.

"ఇంకోటి కొనుకుంటాం కదా - ఇక రెండు నెలల్లో రాణికి కొడుకు పుడతాడు - అంటే మీకు మనవడేగా."

"ఆ..." అంది జానకి ఎటోచూస్తూ, ఆ సంభాషణ అక్కడికి ఆగిపోయింది. 'అంటే, తన డబ్బంతా ఇలా ఖర్చు చేసేసి, తను పూర్తిగా వీళ్ళపై ఆధారపడేట్టు చేసేస్తే... తను హెల్ప్‌లెస్ - హమ్మో!' జానకి ఖంగారుపడిపోయింధి.

"రాణీ" కేక పెట్టింది.

రాణీ వచ్చింది. కళ్ళన్నీ ఉబ్బి ఉన్నాయి.

"ఏమైందీ?" అంది జానకి.

భార్యభర్తల మధ్య గొడవ చాలా నెలలుగా సాగుతోంది - మీ అత్తని మనం చూస్తున్నాం. రేపు కాలుచెయ్యి పనిచేయకపోతే మనమేగతి - అందుకేనే చెప్పినట్టు చేయాలావిడ. ఇది అమ్మేసి నా పేరున ఒక ఫ్లాట్ కొనమను -" ఇదే ధోరణిలో వేధిస్తున్నాడు వివేక్ రాణిని.

ఆ రాణీ ఎటూ చెప్పలేక సతమతమయిపోతోంది ఇన్ని నెలలుగా, ఈ విషయం తెల్సాక జానకి చాలా కృంగిపోయింది. జానకి నవ్వింది. "చూడు రాణీ... నాకోసం మీరు పోట్లాడుకోవద్దు - నా బతుకు నేను చూసుకుంటాను" అంది నెమ్మదిగా.

"లేదత్తా - ఒంటరిగా ఎలా వుంటావ్ నువ్వు చెప్పు" ఎప్పటికయినా మాకే ఇస్తావుగా. అందుకని ఆయన..."

ఆ తర్వాత రాణీ మాటలు వినదల్చుకోలేదు జానకి.

"అమ్మో ఎంత కుట్ర. నమ్మించి చివరకి నన్ను బికారిని చేయాలని వీళ్ళ ఆలోచన. బాబోయ్ - అందుకే అమ్మ ఎప్పుడూ చెప్పేది "కట్టుకున్నవాడో, కన్నవాళ్ళో వుండాలని" నిజమేనేమో!

ఆర్నెల్లు గడిచాయి. ఆ ఇంట్లోంచి రాణి, వివేక్ వెళ్ళిపోయారు. ఆ ఇల్లు అమ్మేసింది జానకి.

వృద్ధాశ్రమంలో ఒక పెద్దగదిలో వుంటూ, "అమ్మా, నువ్వు చెప్పింది నిజమే, వృద్ధాప్యంలో నిన్నెవరు చూస్తారు?" అనేదానివి - నిజంగా నిజం - వయసు వున్నపుడు ఉద్యోగమే జీవితం అనుకున్నా... రిటైర్‌మెంట్‌లో ఇంత విషాదముందా! అందరికీ వుందా! లేదు, లేదు - నా ఒక్కర్తికే" ఎడతెగని కన్నీళ్ళు. ఆపుకుందుకు ప్రయత్నం చేయలేదు జానకి ఆ మసక చీకట్లో!

మరో రెండు నెలలు గడిచాయి.

"నాకెవరూ లేరు - మీరంతా నావాళ్ళే" అంటూ ఆ ఇల్లు అమ్మిన డబ్బులో కొంత ఆశ్రమానికి విరాళంగా ఇచ్చేసింది జానకి.

'కట్టుకున్నవాడు, కన్నవాడు లేకపోయిన బత్తికేస్తున్నాను చూసావా అమ్మా'- గది గోడకి వేలాడదీసిన తల్లి ఫోటోతో మాట్లాడి కన్నీళ్ళద్దుకుంది జానకి, రిటైర్డ్ సెక్షన్ ఆఫీసర్.

"షష్టిపూర్తి కథలు" - ఆంధ్రభూమి సచిత్ర పత్రిక 64 అక్టోబర్ 2000